క్లుప్తంగా

మిరప నర్సరీల తనిఖీ



గుంటూరు రూరల్: ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో మిరప నర్సరీలను శుక్రవారం జిల్లా ఉద్యానశాఖ అధికారి పి.రవీంద్రబాబు తనిఖీ చేపట్టారు. వట్టిచెరుకూరు మండలం లేమల్లేపాడు గ్రామంలోని నర్సరీలను సందర్శించారు. అనుమతులు, రికార్డులు, బిల్ బుక్స్ తనిఖీ చేశారు. రికార్డులు ఏవిధంగా నమోదు చేయాలి తదితర ఆదేశాలను జారీ చేశారు. మండల ఉద్యాన అధికారి ఎం.బాబి, గ్రామ ఉద్యాన సహాయకుడు దుర్గానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్వీఆర్జేసీ అధ్యాపకురాలికి డాక్టరేట్



గుంటూరు రూరల్: అధ్యాపకులు, విద్యార్థుల లక్ష్య సాధనకు తమ కళాశాల ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆర్వీఆర్జేసీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం కళాశాలలో ఏర్పాటు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న గద్దె శ్వేతకు విశ్వేశ్వరయ్య సాంకేతిక విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసిందని తెలిపారు. 'డేటా సెక్యూరిటీ ప్రొటెక్షన్ మెకానిజమ్ ఫర్ క్లౌడ్ స్టోరేజ్ సిస్టం విత్ ఫ్యాక్టర్ రివోకబిలిటీ యూజింగ్ ఎన్క్రిప్షన్ ఫర్ ఎఫిషియంట్ కమ్యూనికేషన్' అనే అంశంపై డాక్టర్ జె.అమృతరాజ్ పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించిందన్నారు. డాక్టరేట్ పొందిన అధ్యాపకురాలిని కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, కార్యదర్శి ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కృష్ణప్రసాద్ అభినందించారు.

అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ రైస్ పట్టివేత

పెదనందిపాడు: అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ రైస్‌ను పట్టుకున్నట్లు ఎస్ఐ అబ్దుల్ రెహమాన్ శుక్రవారం తెలిపారు. మండల పరిధిలోని వరగాని గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న 5.3 టన్నుల పీడీఎస్ రైస్‌ను పట్టుకున్నారు. లారీని నడుపుతున్న కట్టా నరసింహంతో పాటు మరో ఇద్దరినీ అదుపులోకి తీసుకుని లారీని సీజ్ చేసినట్లు ఆయన చెప్పారు. పీడీఎస్ రైస్‌ను పౌర సరఫరాల శాఖ గోడౌన్‌కు తరలించారు.

సర్వేపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

పెదకాకాని: నిబంధనల ప్రకారం ఓటరు జాబితా సమగ్ర సర్వే జరగాలని తహసీల్దారు పి.రత్నం అన్నారు. నంబూరు సచివాలయంలో శుక్రవారం బీఎల్ఓల సమావేశం జరిగింది. కొత్త ఓటర్ల నమోదు, తప్పులు సవరణ, చనిపోయిన వారి పేర్ల తొలగింపు పక్కాగా ఉండాలని స్పష్టం చేశారు. వీఆర్ఓలు, సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎంటీఎస్ అమలు చేయాలి

గుంటూరు ఎడ్యుకేషన్: ఎయిడెడ్ కళాశాలల్లో పనిచేస్తున్న పార్ట్ టైం అధ్యాపకులకు మినిమం టైం స్కేల్ (ఎంటీఎస్) అమలు చేయాలని ఏపీ ఎయిడెడ్ కళాశాలల పార్ట్‌టైం అధ్యాపక సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆరిగ జోషిరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సంఘ నాయకులు శుక్రవారం ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, టి. కల్పలతారెడ్డిని వారి క్యాంపు కార్యాలయాల్లో కలసి వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా జోషిరావు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఎయిడెడ్ పార్ట్‌టైం అధ్యాపకులకు న్యాయం జరగలేదని తెలిపారు. ఈ విషయమై సీఎం వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డిని గతంలో కలసి విజ్ఞప్తి చేయగా, ఆయన పరిష్కారానికి గాను అధికారుల్ని ఆదేశించారని తెలిపారు. ఈ సమస్యపై రాష్ట్రవ్యాప్తంగా ప్రజా ప్రతినిధులందరికీ వినతిపత్రాలు సమర్పిస్తున్నట్లు తెలిపారు.

నవజాత శిశువుల సరంక్షణపై శిక్షణ

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ శుశ్రుత హాలులో శుక్రవారం నవజాత శిశు సంరక్షణపై కేర్ కంప్యానియన్ ప్రోగ్రామ్ జరిగింది. నర్సింగ్ సిబ్బందికి శిక్షణ ఇచ్చేందుకు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా డీఎంహెచ్ఓ డాక్టర్ శోభరాణి ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అప్పుడే పుట్టిన శిశువుల ప్రాణ రక్షణే ధ్యేయంగా ప్రభుత్వం కేర్ కంప్యానియన్ ప్రోగ్రామ్ నిర్వహిస్తోందన్నారు. నర్సింగ్ సిబ్బంది శిక్షణ ద్వారా మెళకువలు నేర్చుకుని పసికందుల ప్రాణాలు కాపాడాలన్నారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ మాట్లాడుతూ శిక్షణా కార్యక్రమాల ద్వారా సీనియర్ వైద్యులు తమ అనుభవాన్ని వివరిస్తారని, శిక్షణ పొందేవారికి ఇది ఎంతో ఉపయోగపడుతోందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ హేమంత్, డాక్టర్ తనూజ, డాక్టర్ జీనా, పాల్గొన్నారు.

కవి వేదయ్య ఇకలేరు

పాత గుంటూరు: వాణిజ్య పన్నుల శాఖ విశ్రాంత డెప్యూటీ కమిషనర్, కవి, కళాపోషకుడుగా ప్రసిద్ధి చెందిన బి.వేదయ్య (86) మృతిచెందారు. గుంటూరు లక్ష్మీపురంలో వారి గృహంలో వేదయ్య పార్థివదేహాన్ని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు డొక్కా మాణిక్య వరప్రసాద్, ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, కన్నా మాస్టారు సందర్శించి ఘనంగా నివాళులు అర్పించారు. వేదయ్య మృతిపట్ల పలువురు కవులు, కళాకారులు, సాహితీ అభిమానులు శ్రద్ధాంజలి ఘటించి వారు తెలుగు సాహిత్యానికి చేసిన సేవల్ని కొనియాడారు

పక్కాగా.. పారదర్శకంగా

- 'వైఎస్సార్ సంపూర్ణ పోషణ'లో పారదర్శకతకు పెద్ద పీట
- గర్భిణులకు, బాలింతలకు సకాలంలో పౌష్టికాహారం
- ఫేస్ రికగ్నైజేషన్ ద్వారా సరుకులు అందజేస్తున్న అంగన్‌వాడీలు

ప్రత్తిపాడు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతి శాఖలోనూ పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. అవినీతికి తావులేకుండా ఎక్కడికక్కడ కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోంది. తాజాగా ఐసీడీఎస్‌లోనూ ఇదే విధానాన్ని అమలు చేస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు, బాలింతలకు ఈ నెల నుంచి ఇళ్ల వద్దకే అందిస్తున్న పోషకాహారం పక్కదారి పట్టకుండా పటిష్ట ప్రణాళికతో ముందుకు వెళ్తోంది.

ఫేస్ రికగ్నైజేషన్ యాప్ ద్వారా..

పౌష్టికాహారం పంపిణీలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా ప్రభుత్వం ప్రత్యేకంగా ఎస్‌సీఎం ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. యాప్ వినియోగంపై ఇప్పటికే అంగన్‌వాడీలకు పూర్తిస్థాయి శిక్షణ ఇచ్చారు. తమ మొబైల్స్‌లో ఇన్‌స్టాల్ చేసుకున్న యాప్ ద్వారా అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకులు రికగ్నైజ్ చేసుకుంటారు. అనంతరం ఫేస్ రికగ్నైజేషన్ సిస్టం ద్వారా లబ్ధిదారుల ఫోటోను నమోదు చేస్తారు. లబ్ధిదారులు నడవలేని, కేంద్రానికి వచ్చి సరుకులు తీసుకోలేని స్థితిలో ఉంటే వారు సూచించిన కుటుంబ సభ్యుల ఫోటోను యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. అప్పుడు మాత్రమే వారికి సరుకులు అందిస్తారు. లబ్ధిదారులకు ఎప్పుడు సరుకులు అందజేసినా ఇదే పద్ధతిని అనుసరించనున్నారు.



రామానగర్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో లబ్ధిదారులను ఫోటో తీసుకున్న కార్యకర్త



మహిళకు అందిజేస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్టు

ప్రాజెక్టు	: ప్రత్తిపాడు
మండలాలు	: ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను, వట్టిచెరుకూరు, గుంటూరు రూరల్
అంగన్‌వాడీ కేంద్రాలు	: 223
మినీ అంగన్‌వాడీ కేంద్రాలు	: 03
గర్భిణులు	: 1,045
బాలింతలు	: 816
0–6 నెలలు– 3 ఏళ్ల చిన్నారులు	: 4,946
3– 6 ఏళ్ల చిన్నారులు	: 2,051

పారదర్శకత కోసమే

పోషకాహారం పంపిణీలో పారదర్శకత కోసమే ప్రభుత్వం ఈ ముఖ ఆధారిత ఫోటో విధానాన్ని అమలు చేస్తోంది. ప్రతి నెల పక్కాగా లబ్ధిదారులకు సరుకులను అందించేలా అంగన్‌వాడీలకు ఆదేశాలిచ్చాం. కోడి గుడ్లు, పాలు రెండు విడతలుగా అందించనున్నాం.

– వి.సుజాతదేవి, సీడీపీవో, ఐసీడీఎస్, ప్రత్తిపాడు

రాష్ట్రంలో జగనన్న సుపరిపాలన

- పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య
- ములుకుదురులో 'గడప గడపకు మన ప్రభుత్వం'

చేబ్రోలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందిస్తూ ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నారని పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అన్నారు. పొన్నూరు మండలం ములుకుదురు గ్రామంలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. గ్రామస్తులు ఎమ్మెల్యే కిలారికి ఘనస్వాగతం పలికారు. గ్రామంలో ఎమ్మెల్యే రోశయ్య ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి, కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన గ్రామసభలో ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనా వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చారన్నారు. పేద ప్రజల జీవన శైలిలో మార్పులు తీసుకురావటం కోసం నవరత్నాల పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కందుల దుర్గాదేవి, ఎంపీటీసీ సరోజినీ, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ జ్యోతి, ఏఎంసీ చైర్మన్, ఆకుల వెంకటేశ్వరరావు, స్టేట్ ఇరిగేషన్ బోర్డు డైరక్టర్ దాసరి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు. ములుకుదురులో జరుగుతున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నియోజకవర్గ పరిశీలకులు అన్నాబత్తుని సదాశివరావు పరిశీలించారు. ఆయనను ఎమ్మెల్యే కిలారి ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే పనితీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.



వృద్ధురాలికి సంక్షేమ కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే రోశయ్య, పరిశీలకులు సదాశివరావు

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవించాలి

గుంటూరు రూరల్: పౌష్టికాహారం తీసుకుని తల్లీబిడ్డ ఆరోగ్యంగా జీవించాలని 26వ డివిజన్ అంకిరెడ్డి పాలెం కార్పొరేటర్ శ్యామల వెంకటరమణాదేవి అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని దాసరిపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌లను గర్భిణులకు, బాలింతలకు అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిన్నారులు ఆరోగ్యంగా ఎదగాలని పౌష్టికాహారం అందజేస్తున్నారని తెలిపారు. ప్రజల ఆరోగ్య భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంకిరెడ్డిపాలెం మాజీ సర్పంచ్ శ్యామల, అంగన్‌వాడీ కార్యకర్తలు కృష్ణకుమారి, అంజలి, ధనలక్ష్మి, పుష్పలత, హేమలత, ప్రశాంతి, లక్ష్మి, కమలమ్మ, మీనా, ఆశ వర్కర్లు అన్నపూర్ణమ్మ, ఏఎన్ఎం శివపార్వతి తదితరులు పాల్గొన్నారు.



పౌష్టికాహారం కిట్‌లు అందజేస్తున్న కార్పొరేటర్ వెంకటరమణాదేవి

తల్లిపాలతో బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి



యనమదలలో అవగాహన కల్పిస్తున్న సీడీపీవో వి.సుజాతదేవి, అడిషనల్ సీడీపీవో విజయనిర్మల



తుమ్మలపాలెంలో మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది

సీడీపీవో వి. సుజాతదేవి

యనమదల (ప్రత్తిపాడు): తల్లిపాలతో బిడ్డకు వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందని సీడీపీవో వి. సుజాతదేవి అన్నారు. మండల పరిధిలోని యనమదల శివాలయం సెంటరులో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీడీపీవో వి. సుజాతదేవి హాజరయ్యారు. గర్భిణులకు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందజేశారు. అనంతరం సీడీపీవో మాట్లాడుతూ బిడ్డ పుట్టిన తరువాత మొదటి మూడు నాలుగు రోజులు పసుపురంగులో వచ్చే ముర్రుపాలను కచ్చితంగా బిడ్డకు పట్టించాలన్నారు. ముర్రుపాలు బిడ్డకు మొదటి టీకాలా పనిచేస్తాయని, మొదటి ఆరు నెలలు తప్పనిసరిగా తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని చెప్పారు. అడిషనల్ సీడీపీవో విజయనిర్మల మాట్లాడుతూ ఫేస్ రికగ్నైజేషన్ సిస్టమ్ ద్వారా ఇంటికి సరుకులు ఇవ్వడం జరుగుతుందన్నారు. సూపర్‌వైజర్ ఎం వెంకటరత్నం, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉదయకుమారి, బ్రహ్మమ్మ, శివకుమారి, వెంకటరత్నం పాల్గొన్నారు.

తల్లిపాలతో తెలివితేటలు పుష్కలం

తల్లిపాలను తాగడం ద్వారా బిడ్డకు తెలివితేటలు పుష్కలంగా ఉంటాయని గొట్టిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మేరీ యునిస్ అన్నారు. గొట్టిపాడులోని అంగన్వాడీ కేంద్రలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో చెల్లమ్మ, సెక్టార్ సూపర్‌వైజర్ విజయమారి, ఏఎన్ఎం కళావతి తదితరులున్నారు.

- ప్రత్తిపాడు గ్రామ సచివాలయంలోని హెల్త్‌వెల్‌నెస్ సెంటరులో పీహెచ్ఎన్, ఆశా నోడల్ ఆఫీసర్ నిర్మల ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. గర్భిణులకు, బాలింతలకు తల్లిపాల ఆవశ్యకతను వివరించారు. సూపర్‌వైజర్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.
- తుమ్మలపాలెం హెల్త్ వెల్‌నెస్ సెంటరులో ఏఎన్ఎం శ్రీలత ఆధర్యంలో తల్లులకు తల్లిపాల విశిష్ఠతను తెలియజేశారు. తల్లిపాలు బిడ్డకు దివ్య ఔషధమని తెలియజేశారు. ఆశా కార్యకర్తలు, గర్భవతులు, బాలింతలు పాల్గొన్నారు.

విద్యార్థుల నోట్సుల పరిశీలన తప్పనిసరి: డీవైఈవో

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల నోట్సులను క్రమం తప్పకుండా పరిశీలించాలని గుంటూరు డీవైఈవో పి. వెంకటేశ్వరరావు ఉపాధ్యాయులకు సూచించారు. వేణుగోపాల్‌నగర్‌లోని కోన బాల ప్రభాకరరావు నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాలను శుక్రవారం సందర్శించిన ఆయన పదో తరగతి విద్యార్థుల నోట్, వర్క్‌బుక్స్ పరిశీలించారు. విద్యార్థుల వర్క్ బుక్స్‌ను ప్రతి రోజూ పరిశీలించి, పెండింగ్ లేకుండా చూడాలని ఉపాధ్యాయులకు చెప్పారు. ఇప్పటి నుంచే ప్రణాళికతో ముందుకు వెళ్లాలని సూచించారు. ఎఫ్ఏ–1 మార్కుల్ని షెడ్యూల్ ప్రకారం ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయురాలు మంజులాదేవి, ఉపాధ్యాయులు ఉన్నారు.

దాడి ఘటనలో ఇద్దరిపై కేసు నమోదు

పట్నంబజారు: వ్యక్తిపై దాడి చేసి దూషణకు దిగిన ఇద్దరిపై కేసు నమోదైంది. ముత్యాలరెడ్డి నగర్‌కు చెందిన పల్లప్రోలు కావ్యశ్రీ సోదరుడితో కలసి శుక్రవారం కొత్తపేటలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బంధువుల్ని చూసేందుకు బయల్దేరారు. ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై నెహ్రూనగర్ నుంచి వెంటపడుతూ కొత్తపేట వరకు వచ్చారు. గమనించిన కావ్యశ్రీ,ఆమె సోదరుడు ఎందుకు వెంటపడుతున్నారంటూ ప్రశ్నించడంతో ఇద్దరు ద్విచక్ర వాహనం అడ్డుపెట్టి దాడి చేశారు. కావ్యశ్రీని దుర్భాషలాడారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన కొత్తపేట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాపారికి టోకరా

వ్యాపారిని మాయ చేసి ఫోన్‌పే ద్వారా డబ్బులు కొట్టుకుని ఉడాయించిన వ్యక్తిపై కేసు నమోదైంది. కొత్తపేటకు చెందిన గోలి పూర్ణచంద్రరావు దుస్తుల వ్యాపారం చేస్తుంటారు. శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి 15 చీరలు కొంటానని వచ్చి నమ్మబలికాడు. అయితే, తన వద్ద డబ్బులు లేవని, స్నేహితుడు ఫోన్‌పే చేస్తాడని చెప్పాడు. ముందుగా స్నేహితుడికి ఫోన్ ద్వారా రూపాయి పంపాలని చెబుతూ, ఆయన వద్ద ఫోన్ తీసుకుని వేరే అకౌంట్‌కు రూ. 45వేలు పంపించాడు. అనంతరం అక్కడి నుంచి కనిపించకుండా పోయాడు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

యువతిని వేధిస్తున్న యువకుడిపై కేసు

యువతిని వేధిస్తున్న యువకుడిపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. మల్లికార్జునపేటకు చెందిన పాలెపోగు అజయ్, యువతి కొంతకాలం ప్రేమించుకున్నారు. పెద్దలు వారించడంతో యువతి అజయ్‌తో దూరంగా ఉంటోంది. అయినప్పటికీ వెంటపడి వేధిస్తున్నాడు. యువతి ఇంటికి వెళ్లిన అజయ్ తనను ప్రేమించాలంటూ బెదిరించి భయభ్రాంతులకు గురి చేశాడు. యువతి ఫిర్యాదు మేరకు శుక్రవారం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రెండో రోజు కొనసాగిన విజిలెన్స్ తనిఖీలు



నగరంపాలెం: గుంటూరు ఆటోనగర్‌లోని శ్రీనిధి ఆగ్రో సైన్సెస్ సంస్థలో శుక్రవారం విజిలెన్స్ అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టారు. నరసరావుపేట టౌన్‌లో అనధికారికంగా నిల్వ చేసిన సుమారు రూ.50 లక్షల విలువైన మైక్రో న్యూటియన్స్ ఫర్టిలైజర్స్, మెగ్నీషియమ్ సల్ఫేట్ నిల్వల్ని గుంటూరు రీజినల్ విజిలెన్స్ అధికారులు గురువారం పట్టుకున్న సంగతి తెలిసిందే. నిల్వల్లో గుంటూరులోని శ్రీనిధి పేరుతో కిలోల ప్యాకెట్లను గుర్తించారు. ఈ మేరకు విజిలెన్స్ ఎస్పీ కె.ఈశ్వరరావు ఆదేశాల మేరకు రెండో రోజు శుక్రవారం ఆటోనగర్‌లోని శ్రీనిధి సంస్థలో తనిఖీలు జరిపారు. గతేడాదిలో 26 మెట్రిక్ టన్నుల (20, 10 కిలోలు, 1కిలో ప్యాకెట్లు) సూక్ష్మపోషక ఎరువుల్ని నరసరావుపేటకు సరఫరా చేసినట్లు గుర్తించారు. అయితే, ఎటువంటి ముడి సరుకుని ఇక్కడ్నుంచి నరసరావుపేటకు పంపించలేదు. ఇక సరుకు తనిఖీ చేయగా, వ్యత్యాసం గుర్తించారు. సంస్థలో రూ.56 వేలు విలువ చేసే 700 కిలోల మెగ్నీషియం సల్ఫేట్‌ను స్వాధీనం చేసుకుని 6–ఎ, క్రిమినల్ కేసులు నమోదు చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ వ్యవసాయ అధికారిణి జె.వాసంతి, సీఐ ఎ.శ్రీహరిరావు, ఎస్ఐ ఎం .రామచంద్రయ్య, స్థానిక రెవిన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయం

- శాసనస మండలి చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు
- తహసీల్దారు కార్యాలయం అదనపు గది నిర్మాణానికి శంకుస్థాపన

చేబ్రోలు: అభివృద్ధి పనులకు దాతల సహకారం అభినందనీయమని శాసన మండలి చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో అదనపు గది నిర్మాణానికి గురువారం శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య తదితరులు హాజరయ్యారు. చేబ్రోలుకు చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త పరిమి సత్యనారాయణ ఆర్థిక సహకారంతో రూ.8లక్షల వ్యయంతో నిర్మించనున్న అదనపు గదిని నిర్మించనున్నారు. ఈ సందర్భంగా చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ.. సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఉద్యోగులు, సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేసి, ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. తహసీల్దారుగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కేవీ గోపాలకృష్ణ.. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చూపుతున్న చొరవను అభినందించారు. పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య మాట్లాడుతూ దాత సత్యనారాయణ అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. ఆలయాలకు, పాఠశాలల అభివృద్ధికి చేయూతనిస్తున్న ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు. పరిమి సత్యనారాయణ, తనయుడు సందీప్‌ను సన్మానించారు. తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, ఎంపీడీవో బి.బాబురావు, డీటీ ప్రణతి, సర్పంచ్ అత్తోట వినీతారాణి, వైస్ ఎంపీపీ పసుపులేటి శ్రీనివాసరావు, డీసీఎంఎస్ డైరెక్టర్ కుర్రా పాములు, సొసైటీ అధ్యక్షుడు చందు సాంబశివరావు పాల్గొన్నారు. స్థానికంగా 108 అంబులెన్స్ నిలుపదలకు షెడ్డు ఏర్పాటుకు జీబీసీ రహదారి పక్కన స్థలాన్ని పరిశీలించి, అందించాలని మండల అధికారులకు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య సూచించారు.



శంకుస్థాపన చేస్తున్న చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

చినకోండ్రుపాడు సొసైటీ నూతన కమిటీ ప్రమాణస్వీకారం

చినకోండ్రుపాడు (ప్రత్తిపాడు): రైతులకు నిస్వార్థంగా సేవలు అందించడం జరుగుతుందని సొసైటీ అధ్యక్షుడు ఆళ్ల రామస్వామి అన్నారు. మండల పరిధిలోని చినకోండ్రుపాడు సొసైటీకి నూతన కమిటీని నియమించారు. అధ్యక్షుడిగా నడింపాలెం గ్రామానికి ఆళ్ల వీరస్వామి, డైరెక్టర్లుగా తుమ్మలపాలెం గ్రామానికి చెందిన కోనంకి నాగరాజు, తిక్కిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన నేలపాటి వేదమణిని నియమించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం స్థానిక సొసైటీ వద్ద ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. రామస్వామి సొసైటీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. గ్రామ సర్పంచ్ లాం రత్నకుమార్‌తో పాటు ఎంపీటీసీలు పూర్ణి వెంకటేశ్వరరావు, వి.మాణిక్యరావు నూతన కమిటీని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల శ్రేయస్సుకు కృషి చేస్తోందన్నారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన స్థానిక ఎమ్మెల్యే సుచరితకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ మాజీ అధ్యక్షులు కట్టా సుబ్బారావు, గింజుపల్లి సుబ్బారావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కమిటీ అధ్యక్షుడిని సత్కరిస్తున్న ప్రజా ప్రతినిధులు

ప్రతి న్యాయవిద్యార్థి సోషల్ ఇంజినీరే

ఏపీ హైకోర్ట్ అడ్వకేట్ ఎస్.శ్రీనివాసరావు

చేబ్రోలు: న్యాయ విద్యను అభ్యసించే ప్రతి విద్యార్థి సోషల్ ఇంజినీరేనని ఆలిండియా లాయర్స్ యూనియన్ ఆంధ్రప్రదేశ్ జనరల్ సెక్రటరీ, ఏపీ హైకోర్ట్ అడ్వకేట్ ఎస్.శ్రీనివాసరావు అన్నారు. వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో ''న్యాయ విద్య – కొత్త మార్గాలు'' అనే అంశంపై ప్రత్యేక అతిథి ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏపీ హైకోర్ట్ అడ్వకేట్ ఎస్.శ్రీనివాసరావు మాట్లాడుతూ సమాజంలోని ప్రతి సమస్యను పరిష్కరించేది లాయరేనని పేర్కొన్నారు. న్యాయ విద్యను అభ్యసించే విద్యార్థులు ప్రతిరోజు సమాజంలో ఎటువంటి సంఘటనలు, పరిణామాలు సంభవిస్తున్నాయో గమనిస్తు ఉండాలన్నారు. న్యాయవాది వృత్తి సవాళ్లతో కూడుకున్నదని, ఇందులో రాణించాలనుకునే విద్యార్థులు పుస్తకాలు, జర్నల్స్ బాగా చదవాలన్నారు. ప్రస్తుతం డిజిటలైజేషన్, సైబర్ నేరాలు పెరుగుతున్నందు వల్ల న్యాయ శాస్త్రం చదివే విద్యార్థులు ఆర్టిఫిసియల్ ఇంటిలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్ వంటి కొత్త టెక్నాలజీలపై పట్టు సాధించాలన్నారు. క్రిమినల్, సివిల్, మాట్రిమోనియల్, కమర్షియల్, లేబర్, వినియోగదారుల చట్టాలపై అవగాహన పెంచుకోవాలని విద్యార్థులకు సూచించారు.



ఏపీ హైకోర్ట్ అడ్వకేట్ ఎస్.శ్రీనివాసరావు

అభివృద్ధి పనుల్లో నాణ్యత తప్పనిసరి

నెహ్రూనగర్: అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని డెప్యూటీ మేయర్ షేక్ సజీల చెప్పారు. ఆమె శుక్రవారం 7వ డివిజన్ పరిధిలోని లిబర్టీ థియేటర్ ఎదురుగా ఉన్న బెస్తపేటలో రూ.27లక్షలతో కొత్తగా వేస్తున్న మంచినీటి పైపు లైన్, యూజీడీ లైన్, సైడ్ డ్రెయిన్లు, సీసీ రోడ్డు నిర్మాణ పనుల్ని పరిశీలించారు. ప్రజ లకు ఇబ్బందులు లేకుండా పనుల్ని చేపట్టాలని ఆమె నగరపాలక సంస్థ అధికారులకు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు షౌకత్, కిశోర్, సుధాకర్ పాల్గొన్నారు.

పిల్లందరితో ఆల్బెండోజల్ మాత్రలు మింగించాలి

డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రావణ్‌బాబు

గుంటూరు మెడికల్: జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం కార్యాలయంలో పలు ప్రభుత్వ శాఖల అధికారులతో డీఎంహెచ్‌వో డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 10న జాతీయ నులి పురుగుల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు 337 ఉన్నాయని, వీటిల్లో 5,91,322 మంది విద్యార్థులు ఉన్నట్లు వెల్లడించారు. 1 నుంచి 19 సంవత్సరాల్లోపు పిల్లలందరికీ ఆల్బెండోజల్ మాత్రలు మధ్యాహ్నం భోజనం అనంతరం ఇవ్వాలని ఆయన సూచించారు. 1 నుంచి రెండు సంత్సరాల్లోపు పిల్లలకు అర మాత్ర నీటిలో కరిగించి తాగించాలని, 3 నుంచి 19 సంవత్సరాల పిల్లలకు ఒక మాత్రను నమిలించి మింగించాలని చెప్పారు. ఈనెల 5న ప్రధానోపాధ్యాయులకు ఆల్బెండోజల్ 400 ఎంబీ మాత్రలు అందించాలని అధికారుల్ని ఆదేశించారు. ఈనెల 8న ప్రధానోపాధ్యాయులు పాఠశాల అసెంబ్లీలో నులు పురుగులు వచ్చే అనారోగ్య సమస్యలు రక్తహీనత, పోషకాహార లోపం, రోగ నిరోధక తగ్గుదల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు.10వ తేదీన మాత్రలు తీసుకోని వారుంటే 17న జరిగే మాపప్ రౌండ్‌లో ఇవ్వాలని చెప్పారు. జిల్లా విద్యా శాఖ అధికారి పి.శైలజ మాట్లాడుతూ మాత్రలు పిల్లల చేతికి ఇవ్వకూడదని, పొరపాటున ఎక్కువ మోతాదు వేసుకుంటే ప్రమాదానికి దారి తీస్తోందని తెలిపారు. ఇంటర్మీడియట్ బోర్డు రీజినల్ ఇన్‌స్పెక్షన్ ఆఫీసర్ జి.కె.జుబేర్, పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

శారీరక శ్రమ, మానసిక ప్రశాంతతతో గుండె పదిలం

గుంటూరు ఎడ్యుకేషన్: శారీరక శ్రమ, మానసిక ప్రశాంతతో గుండెను పదిలంగా ఉంచుకోవచ్చునని ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ పి.నాగ హరిత పేర్కొన్నారు. అమరావతి రోడ్డు హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలోని హాస్పిటల్ మేనేజ్‌మెంట్ విభాగం–రమేష్ ఆస్పత్రి సంయుక్తంగా 'జీవన విధానం–గుండె పనితీరుపై ప్రభావం' అనే అంశంపై శుక్రవారం సదస్సు నిర్వహించారు. ముఖ్య వక్తగా పాల్గొన్న డాక్టర్ నాగ హరిత మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ దినచర్య పట్టిక అనేది ఉండాలని, తద్వారా ఒత్తిడి నుంచి ఉపశమనం దొరుకుతుందని సూచించారు. ఉదయాన్నే నిద్రలేచి, యోగా, ప్రాణాయామం, వ్యాయామం చేసే వారిలో 10 నుంచి 35 శాతం ఎక్కువగా ప్రయోజనం ఉంటుందని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ మాట్లాడుతూ జీవన విధానంతో సగటు మనిషి ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రతి నెలా అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. సదస్సులో కళాశాల ఉపాధ్యక్షుడు ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ, ఎంబీఏ విభాగాధిపతి వి. చక్రవర్తి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డి. కల్యాణి, సీహెచ్. వైష్ణవి, సీహెచ్. వేదవతి, వి. అభిలాష్ పాల్గొన్నారు.

